క్లుప్తంగా

శనైశ్చరునికి తైలాభిషేకాలు



శనైశ్చరుని దర్శనానికి బారులు తీరిన భక్తులు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించి, ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. శనికి ప్రీతికరమైన శనివారం పురస్కరించుకుని దేవదాయ–ధర్మదాయ శాఖ ఉప కమిషనర్, దేవస్థానం నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో భక్తుల పూజలకు ఏర్పాట్లు చేశారు. ముందుగా ప్రాతఃకాల సమయంలో ఆలయ అర్చకులు, వేద పండితులు స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపిన అనంతరం భక్తుల దర్శనానికి అనుమతించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా భక్తుల పూజలు, తైలాభిషేకాల టిక్కెట్ల ద్వారా దేవస్థానానికి రూ.1,84,680, అన్నప్రసాదం విరాళాల గా రూ.41,232తో మొత్తం రూ.1,84,912 ఆదాయం వచ్చినట్టు డీసీ అండ్ ఈఓ తెలిపారు.

సంక్రాంతి కానుకలేవీ బాబూ..



గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: ప్రజలకు ఇస్తానన్న సంక్రాంతి కానుకలు ఏమయ్యాయని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ప్రశ్నించారు. శనివారం మలికిపురంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విచ్చలవిడి కోడి పందేలు తప్ప ప్రజలకు ఏం మేలు చేశారని ఆయన పేర్కొన్నారు. పండగ పూట ప్రజలను పస్తులుంచారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక రూ.67 వేల కోట్లు అప్పులు చేశారని ఆయన పేర్కొన్నారు. జగన్ పెంచిన పింఛన్లకు కాస్త నగదు పెంచి ఇవ్వడం తప్ప ఏ హామీ నెరవేర్చారని ఆయన ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ నాయకులు అడబాల జానకీ రామ్, నామన మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

అభిమానులను అలరించాలన్నదే నా అభిలాష



అప్పనపల్లి బాలాజీని దర్శించుకున్న కామెడీ ఆర్టిస్ట్ అశోక్

మామిడికుదురు: ప్రేక్షకులు కోరుకునే వినోదం అందించి, వారిని మెప్పించాలన్నదే తన అభిలాష అని కామెడీ నటుడు అశోక్ తెలిపారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని స్వగ్రామం పెదపట్నం వచ్చిన ఆయన కుటుంబ సభ్యులతో కలసి శనివారం అప్పనపల్లి బాల బాలాజీ స్వామిని దర్శించుకున్నారు. అశోక్ మాట్లాడుతూ బుల్లితెర హాస్య కార్యక్రమాలతో పాటు పలు చిత్రాల్లో నటించే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. కోనసీమ నేపథ్యంలో నిర్మించిన హాయ్ చిత్రంలో తన నటనకు ప్రశంసలు లభించడం ఆనందంగా ఉందన్నారు. సినీ ప్రేక్షకులకు మరింత వినోదం అందించడమే తన లక్ష్యమని అశోక్ పేర్కొన్నారు.

ఇరువర్గాలపై కేసులు

అంబాజీపేట: సంక్రాంతి సందర్భంగా ఈ నెల 14న మండలంలోని ముక్కామలలో జరిగిన సంఘటనపై ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై కె.చిరంజీవి శనివారం తెలిపారు. ఇందుకు సంబంధించి విలేకరులతో మాట్లాడుతూ ముక్కామల హైస్కూల్ సమీపాన సంక్రాంతి సంబరాలు జరుగుతున్న సమయంలో అదే గ్రామానికి చెందిన పిల్లా పవన్‌కు, మట్టపర్తి లోవరాజు, పిల్లి నరేష్‌కు బైక్ పార్కింగ్ విషయంలో వివాదం తలెత్తింది. ఈ విషయంలో పవన్‌కు మద్దతుగా అతని తండ్రి దుర్గా సోమరాజు, సోదరుడు ఏసుబాబులు నిలిచారు. వివాదంపై పవన్ తండ్రి సోమరాజు ఫిర్యాదుతో మట్టపర్తి లోవరాజు, పిల్లి నరేష్‌లతో పాటు మరో ఏడుగురిపై కేసు నమోదు చేశామన్నారు. కాగా ఇదే కేసుకు సంబంధించి కొప్పిశెట్టి వాసురాజు ఇచ్చిన మరో ఫిర్యాదుపై పిల్లా పవన్, సోమరాజు, ఏసుబాబులపై కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి



కొత్తపేట సబ్‌జైలులో రిమాండ్ ఖైదీల సంక్షేమంపై సమీక్షిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి రమణారెడ్డి

కొత్తపేట: రిమాండ్‌లో ఉన్న ఖైదీలంతా సత్ప్రవర్తనతో మెలిగి, కుటుంబ సభ్యులతో కలసి సమాజంలో గౌరవంగా జీవించాలని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి పి.రమణారెడ్డి సూచించారు. శనివారం సాయంత్రం స్థానిక సబ్‌జైలును సందర్శించారు. జడ్జి రమణారెడ్డి సబ్‌జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న నిందితుల వివరాలు, బాగోగులు, వారిపై నమోదైన కేసులు, వారి కుటుంబాలు, స్థితిగతుల గురించి ఆరా తీశారు. కుల, మత, వివక్షకు తావు లేకుండా అందరూ సోదరభావంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో పి.శ్రీకర్, డీఎస్పీ వై.గోవిందరావు, డీఎం అండ్‌హెచ్‌ఓ ఎం.దుర్గారావుదొర, డీఈఓ ఎస్కే సలీంబాషా, తహసీల్దార్ వై.రాంబాబు, ఇరిగేషన్ ఏఈ వి.నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గిరాకీ ఉంటేనే గడిచేది

- లేకుంటే పస్తులే..
- రోజంతా కష్టిస్తేనే బతుకుబండి ముందుకు
- ఎండకు, చలికి రోడ్డు పక్కనే నివాసం



ముక్తేశ్వరంలో వ్యవసాయ పనిముట్లు తయారు చేసి జీవనం సాగిస్తున్న రాజస్థాన్ కుటుంబం

అయినవిల్లి: కూటి కోసం కోటి విద్యలు అనే నానుడి అందరికీ తెలిసిందే. ఈ కోవలేనిదే వీరి జీవన విధానం. కమ్మరి పనిని జీవనాధారం చేసుకుని కుటుంబంతో పాటు దేశంలోని వివిధ పల్లెలు, పట్టణాలు తిరుగుతూ వీరు పొట్టపోసుకుంటున్నారు. వ్యవసాయం, ఇంటి పనుల్లో వాడే పనిముట్ల తయారీలో వీరిది అందె వేసిన చేయి. పిల్లాపాపలంతా కలసి రోడ్డు పక్కన గుడారాలు వేసుకుని వర్షం, ఎండ, చలి అని లెక్క చేయకుండా ఎక్కడికి అక్కడ వీరు పరిస్థితులకు తగ్గట్లు మార్చుకుంటూ తమ జీవనం సాగించడం వీరి ప్రత్యేకత. ఇదిగో ఇలాంటి సంచార జాతులకు చెందిన రెండు కుటుంబాల వారు అయినవిల్లి మండలం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఖాళీ స్థలంలో గుడారం వేసుకుని నెల రోజులుగా జీవనం సాగిస్తున్నారు. వీరిది రాజస్థాన్ నుంచి ఏటా వలస వస్తూ మధ్యప్రదేశ్‌లోని కొందరు బంధువులతో కలసి బృందాలుగా వివిధ రాష్ట్రాలు, వివిధ ప్రాంతాల్లో సంచరిస్తూ సంచార జీవన విధానాన్ని సాగిస్తుంటారు. వీరు ఇప్పుడే ఇలా చేస్తున్నారనుకుంటే పొరపడ్డట్టే. కొన్ని దశాబ్దాలుగా వీరి జీవన విధానం ఇలానే కొనసాగుతోంది. ఎందుకంటే ఈ పనిముట్లు తయారు చేయడం ఆషామాషీ వ్యవహారం ఏమీ కాదు. ఫోన్‌లో మాట్లాడుతూ, కుర్చీలో కూర్చుని మేథస్సు ఉపయోగించి చేయనే లేరు. ఈ వృత్తి కొనసాగించేందుకు వివిధ రాష్ట్రాల్లో ఉన్న స్థానిక వాసులు కూడా ఆ కష్టం భరించలేక వివిధ వృత్తులకు మరలిపోయారు. కానీ లోహర్ కులవృత్తిని రాజస్థాన్, మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన ఇప్పటికీ విడవకుండా కొనసాగిస్తుండడం విశేషం.



రోడ్డు పక్కనే చిన్నపిల్లాడిని ఊయల వేసి ఊపుతున్న మహిళ



కత్తులు, కొడవళ్లు మొదలైన ఇనుప పనిముట్లు

గజగజ వణుకుతూ...

గజగజలాడే చలిలోను పిల్లా పాపలతో గూడారంలో తలదాచుకుని జీవనం సాగిస్తున్నారు. సుమారుగా రెండు కుటుంబాల వారు పది మందికి పైనే ఇక్కడ జీవిస్తున్నారు. ఈ ప్రాంతం వ్యవసాయ ఆధారం కావడంతో వీరూ వచ్చిన 15 రోజులు వీరికి గిరాకీ బాగానే ఉంది. కత్తులు, కొడవళ్లు, గునపాలు, పారలు, ఇంటి అవసరాలకు ఉపయోగపడే కత్తిపీటలు, మామిడికాయలు కొట్టే పీట ఇలా పలు రకాల ఇనుప సామాన్లు తయారు చేస్తున్నారు. రోజంతా కష్టపడి కుటుంబం అంతా కష్టపడితేనే జీవనం కొనసాగుతుంది. లేదంటే పస్తులే మాకు మిగిలేది. గిరాకీ బాగుంటే రోజువారి ఖర్చులు పోను రూ.2 వేలు మిగులుతుంది. లేక పోతే దాచుకున్న డబ్బులతో సరిపెట్టుకోవాలి. ఉన్న డబ్బులు అయిపోతే పస్తులే ఉండాలి. గిరాకీ రాకపోతే మరో చోటుకు మకాం మార్చాల్సిందే. ఇదీ వీరి పరిస్థితి.

రోజుకు రూ.రెండు వేలు వస్తుంది



గిరాకీ ఉంటే రోజుకు రూ.రెండు వేలు వస్తుంది. ఖర్చులు పోను రూ.వేయి మిగులుతుంది. గిరాకీ లేకపోతే ఉన్న డబ్బులతోనే జీవనం సాగిస్తున్నాం. మరి గిరాకీ లేకపోతే పస్తులుండాల్సిందే. మరో చోటుకు మకాం మార్చాల్సిందే.

– సర్దార్ సోహన్, పనిముట్ల తయారీదారు

రోగాలు వస్తే అంతే సంగతులు



చలి అనక ఎండనక రోడ్డు పక్కనే గుడారాల్లో జీవనం సాగిస్తాం. ఎవరూ మమ్మల్ని పక్కకు చేరనీయరు. ఊరు కానీ ఊరు మమ్మల్ని ఎవరూ నమ్మరు. రోగాలు వస్తే మా ఖర్మ మాదే. చిన్న పిల్లలతో అలాగే జీవనం సాగించాలి. గిరాకీ ఉంటే బువ్వ లేకపోతే పిల్లా పాపలతో పస్తులే.

– లోహర్ పవన్, పనిముట్ల తయారీదారు

అంతర్వేదిలో భక్తుల రద్దీ



దర్శనానికి వేచియున్న భక్తులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని క్షేత్రంలో శనివారం సంక్రాంతి పర్వదినాల రద్దీ మరింత పెరిగింది. వాహనాల్లో సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులతో పాటు సమీప మండలాల భక్తులు కూడా పోటెత్తారు. దీంతో ఎటు చూసినా ఆలయ ప్రాంగణం భక్తులతో రద్దీగా మారింది. ఆలయ ప్రాంగణంలోని భారీ క్యూలో వెళ్లి స్వామి వారిని వారంతా దర్శించుకున్నారు. భక్తులకు తగిన ఏర్పాట్లను ఏసీ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో దేవస్థానం సిబ్బంది పర్యవేక్షించారు.

నవోదయ పరీక్ష కేంద్రం తనిఖీ

పి.గన్నవరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జవహర్ నవోదయ పరీక్ష కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ శనివారం తనిఖీ చేసింది. 282 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా, 225 మంది హాజరయ్యారు. ఈ కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పి.రాంబాబు, కేఆర్ కృష్ణయ్యలు తనిఖీ చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రాల్లో ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలను సీఎస్ డీఎస్‌వీ ప్రసాద్, సెంటర్ లెవెల్ అబ్జర్వర్ గన్నవరపు అమ్మిరాజు అధికారులకు వివరించారు.

కొత్తపేట డీఎస్పీగా మురళీమోహన్



కొత్తపేట: స్థానిక సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ (డీఎస్పీ)గా సుంకర మురళీమోహన్ నియమితులయ్యారు. ఆ మేరకు శుక్రవారం రాత్రి డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా నూతన డీఎస్పీలకు పోస్టింగులతో పాటు వివిధ సబ్ డివిజన్లలో పని చేస్తున్న డీఎస్పీలకు బదిలీలు, వివిధ పోలీస్ అనుబంధ విభాగాల్లో పని చేస్తున్న డీఎస్పీలకు ఎస్‌డీపీఓగా పోస్టింగ్‌లు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దానిలో భాగంగా సుమారు నెల రోజుల క్రితం విశాఖపట్నం మెరైన్ విభాగానికి బదిలీ అయి, ప్రస్తుతం కొత్తపేట ఇన్‌చార్జ్ డీఎస్పీగా పనిచేస్తున్న వై.గోవిందరావు స్థానంలో ఇంటలిజెన్స్ డీఎస్పీగా పని చేస్తున్న సుంకర మురళీమోహన్‌ను నియమించారు. గతంలో నాలుగేళ్లు కొత్తపేట ఎస్సైగా, గతేడాది డిసెంబర్‌లో కొత్తపేట ఇన్‌చార్జ్ డీఎస్పీగా పనిచేశారు. ఆ విధంగా ఈ ప్రాంతంలో శాంతిభద్రతలపై ఆయనకు మంచి అవగాహన ఉంది. ఒకటి, రెండు రోజుల్లో స్థానిక డీఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తారని ఎస్‌డీపీఓ కార్యాలయం సిబ్బంది తెలిపారు.

వారి స్నేహానికి అర్ధశతాబ్దం



యాభై ఏళ్ల తరువాత కలసిన విద్యార్థులు

మలికిపురం: స్థానిక ఏఎఫ్‌డీటీ పాఠశాల 1974–75 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం టేకిశెట్టిపాలెంలో లింగోలు మహాలక్ష్మి(ఎల్‌ఐసీ) ఇంటి వద్ద శనివారం జరిగింది. వారి గురువులు ముప్పర్తి మారియ్య, బిల్ల పేర్రాజు, ఆచార్యులు, మోహన్ దాస్‌లను సన్మానించారు. మహాలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశానికి పలువురు పూర్వ విద్యార్థులు హాజరై నాటి అనుభూతులను పంచుకున్నారు. అరవ చిట్టియ్య, కడలి ప్రసాద్, బెల్లంకొండ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బాలికా సంరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలి



అంబాజీపేటలో ఎంపీపీ, జెడ్పీటీసీలతో పాటు శిక్షణకు హాజరైన వారితో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీఓ విజయశ్రీ

అంబాజీపేట: మండల స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు బాలికా సంరక్షణపై పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పి.గన్నవరం సీడీపీఓ వై.విజయశ్రీ అధ్యక్షతన కిశోరి వికాసంపై శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సీడీపీవో విజయశ్రీ మాట్లాడుతూ గ్రామాల్లో అంగన్‌వాడీ వర్కర్లు, సూపర్‌వైజర్లు పాఠశాల ఉపాధ్యాయులు బాల్య వివాహాల జరిగే సమాచారాన్ని సంబంధిత అధికారులకు చేరవేయాలన్నారు. బాల్యవివాహ రహిత మండలంగా మార్చడానికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. కిశోరి బాలికలకు ఆరోగ్యం, సంపూర్ణ పోషణలపై అవగాహన కల్పించాలన్నారు. వ్యక్తిగత విద్య, పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సంబంధిత శాఖ అధికారులు, శిక్షణ కార్యక్రమానికి హాజరైన సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. మహిళా సంరక్షణ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. శిక్షణలో ఎంపీడీఓ జీవీ సరోవర్, ఎంఈఓ మోకా ప్రకాష్, వైద్యాధికారి ఎ.ఇంద్రావతి, ఎంపీటీసీల మండల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, సూపర్‌వైజర్లు వీఎస్‌పీ మహాలక్ష్మి, ఎస్.వెర్రినమ్మ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు భాగస్వాములు కావాలి

అంబాజీపేట: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంలో స్థానిక ప్రజలంతా భాగస్వాములు కావాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో జీవీ సరోవర్ అధ్యక్షతన స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం వల్ల దోమలు విపరీతంగా పెరిగి రోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. పరిశుభ్రతకు కొంత సమయాన్ని కేటాయించి గ్రామ పరిశుభ్రతకు సహకరించాలన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, ఎంఈఓ మోకా ప్రకాష్, సీడీపీవో వై.విజయశ్రీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మామిడికుదురు: స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమం ద్వారా పరిసరాలను పరిశుభ్రం చేసుకుందామని సర్పంచ్‌లు అడబాల తాతకాపు, చుట్టుగుళ్ల లక్ష్మి పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా శనివారం లూటుకుర్రు, ఈదరాడ గ్రామాల్లో శనివారం స్వచ్ఛ ఆంధ్రా ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం ప్రజల భాగస్వామ్యంతోనే విజయవంతం అవుతుందన్నారు. పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పీవీఆర్‌కే రాజు, డి.సురేష్, సచివాలయ ఉద్యోగులు, స్థానికులు పాల్గొన్నారు.

మలికిపురం: స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్‌లో భాగంగా శనివారం మలికిపురం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి అధ్యక్షతన కార్యాలయ సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది, వెలుగు సిబ్బందితో ఎంపీడీవో జి.మిల్టన్ ×స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్‌ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మండల కార్యాలయం పరిసరాలు పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో ఈ కార్యక్రమం నిర్వహించి పౌరులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, మలికిపురం సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, ఐ.శుభాకర్, డి.సీతారాముడు, వెలుగు ఏపీఎం డీటీ నాగరాజు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజోలు: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శనివారం రాజోలు మండల పరిషత్ కార్యాలయం వద్ద స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్₹ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీపీ కేతా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే వరప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మొక్కుబడి పనులు చేయవద్దని ప్రణాళికాబద్ధంగా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని సూచించారు. ఎంపీడీఓ డి.రాంబాబు, ప్రత్యేకాధికారి ఎస్ఎస్ ప్రసాద్, సీఎంఓ బి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లి: కూటమి ప్రభుత్వ హయంలో ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛ ఆంధ్రా తీర్చిదిద్దుతామని పి. గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. శనివారం



మలికిపురంలో పారిశుధ్యం నిర్వహిస్తున్న ఎంపీపీ సత్యవాణి తదితరులు

ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయనే నేరుగా చీపురుపట్టి చెత్తను ఊడ్చారు. ఆయన వెంట ఈవోపీఆర్డీ సత్యనారాయణ, ఎంపీడీఓ జి.భీమారావు, వివిధ శాఖలకు చెందిన అధికారులు ఉన్నారు. మాగం పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ కాశీ వీవీ సత్యనారాయణ అధ్యక్షతన స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేసి కార్యక్రమం నిర్వహించారు.

అల్లమూరు: పల్లెలు పరిశుభ్ర వాతావరణంలో ఆహ్లాదకరమైన రీతిలో ఉంటాయని ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, ఎంపీడీఓ ఎ. రాజు అన్నారు. ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ నిర్వహించాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా ఈ కార్యక్రమం ప్రారంభమైంది. అందులో భాగంగా మండలంలోని 18 గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు భారీ ర్యాలీలు, మానవహారాలు నిర్వహించి స్వచ్ఛ ఆంధ్ర ఆవశ్యకతను వివరించారు.

అప్పనపల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయానికి శనివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. గోవిందా, గోవింద అంటూ శ్రీ, భూ సమేతంగా కొలువుదీరిన బాలబాలాజీని దర్శించుకున్నారు. వేకువజామున తొలి హారతి కార్యక్రమాన్ని అర్చకులు వేద మంత్రాలతో ఘనంగా జరిపించారు. సుప్రభాత సేవలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పవిత్ర వైనతేయ నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. స్వామి వారికి ముడుపులు, మొక్కులు సమర్పించారు. పాత గుడిలో ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. స్వామికి తలనీలాలు సమర్పించారు. స్వామి వారి సన్నిధిలో నిత్యం జరిగే లక్ష్మీనారాయణ హోమంలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు.



అప్పనపల్లి బాలాజీకి సమర్పిస్తున్న తొలి హారతి

నల్లచెరువులో..

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేద పండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితుల స్వామికి తులసిపూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు.



నల్లచెరువు అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఉత్సవ మూర్తులు

ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి



కొత్తపేటలో రక్తదాతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే బండారు తదితరులు

కొత్తపేట: ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా కొత్తపేట బస్టాండ్ సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా టీడీపీ అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారితో కలసి రోగులకు, పారిశుధ్య కార్మికులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఆస్పత్రిలో రక్తదాన శిబిరాన్ని వారు ప్రారంభించారు. అలాగే గ్రామ పంచాయతీ ఆవరణలో వృద్ధులకు ఎమ్మెల్యే సత్యానందరావు, యువ నాయకుడు బండారు సంజీవ్ దుప్పట్లను పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఆకుల రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కేవీ సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

అంబాజీపేట: ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా అంబాజీపేట, పుల్లేటికుర్రు గ్రామాల్లో శనివారం పార్టీ నాయకులు వక్కలంక బుల్లియ్య ఏర్పాటు చేసిన దుస్తులను నిరుపేదలకు పంచారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: మాజీ సీఎం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పి.గన్నవరంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, టీటీడీ బోర్డు మాజీ మెంబర్ డొక్కా నాథ్‌బాబు, నాయకులు పాల్గొన్నారు.

దిండిలో..

మలికిపురం: దిండి గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, సర్పంచ్ ముదునూరి శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: మండలంలోని శానపల్లిలంకలో ఎన్టీఆర్ వర్ధంతిని కూటమి నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ స్థానికంగా ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం విలస న్యూలైఫ్ సెంటర్‌లో రోగులకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సయ్యపరాజు సత్తిబాబురాజు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, బడుగు భాస్కర్ జోగేష్, తదితరులు ఉన్నారు.

స్టీల్‌ప్లాంట్‌కు ప్రత్యేక ప్యాకేజీపై హర్షం

కొత్తపేట: విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వడంపై బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన స్థానికంగా ఆయన స్వగృహంలో పలువురు పార్టీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ నష్టాలను అధిగమించి, ప్లాంట్ పూర్తిస్థాయి ఉత్పాదనతో లాభాల బాట పెట్టేందుకు రూ.11,440 కోట్ల రివైవల్ ప్యాకేజీని ప్రకటించిందని ఆయన తెలిపారు. ఈ సాయం స్టీల్ ప్లాంట్ మనుగడకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, కేంద్రమంత్రి కుమారస్వామి, మరో కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు సంపతి కనకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన

మామిడికుదురు: పెదపట్నంలోని ఉమా మూలేశ్వర స్వామి, వేణుగోపాలస్వామి, కనకదుర్గమ్మ వార్ల ఆలయాల ప్రాంగణంలో శనివారం భారీ అన్న సమారాధన జరిగింది. 20వ సప్తాహం శుక్రవారంతో ముగిసింది. దీనిని పురస్కరించుకుని ఆలయం వద్ద అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ అన్న సమారాధనకు భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అన్నప్రసాదం స్వీకరించారు. ముత్యాల వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఈ అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

శ్రీరామ్మూర్తి మృతి తీరనిలోటు



గుత్తుల శ్రీరామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న మాజీ మంత్రి పినిపే విశ్వరూప్

అయినవిల్లి: క్రాప, శంకరాయగూడెం ఎంపీటీసీ సభ్యుడు గుత్తుల శ్రీరామ్మూర్తి మృతితో వైఎస్సార్ సీపీకి తీరని లోటు ఏర్పడిందని మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. శనివారం గుత్తుల శ్రీరామ్మూర్తి కుటుంబ సభ్యులను ఆయన స్వగృహంలో కలసి సంతాపం తెలిపారు. తొలుత శ్రీరామ్మూర్తి చిత్రపటానికి విశ్వరూప్, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్, ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు చెల్లుబోయిన శ్రీనివాస్, మందపాటి కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సామాజిక విలువలకు దర్పణం

మనసారా నా సీసాలు

రాజోలు: మానవీయ సామాజిక విలువలకు ×మనసారా నా సీసాలు₹ గ్రంథం దర్పణంగా నిలుస్తుందని మాజీ డిప్యూటీ స్పీకర్ ఏవీ సూర్యనారాయణరాజు అన్నారు. శనివారం చింతలపల్లిలోని ఏవీ కల్యాణ మండపంలో తెలుగు పండిట్ దేవరకొండ శ్రీనివాస వెంకట రమణారావు రచించిన ×మనసారా నా సీసాలు₹, ×సున్నా శతకము₹ గ్రంథాల ఆవిష్కరణ జరిగింది. చెరుకూరి వెంకట సూర్యనారాయణ శర్మ అధ్యక్షతన జరిగిన గ్రంథావిష్కరణ సభలో హైదరాబాదుకు చెందిన ప్రముఖ కవి విట్టుబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ×మనసారా నా సీసాలు₹ గ్రంథాన్ని రాయప్రోలు జగదీశ చంద్రశర్మ, ×సున్నా శతకము₹గ్రంథాన్ని తెన్నేటి నరసింహమూర్తి సమీక్షించి గ్రంథంలోని అంశాలను వివరించారు. సున్నా శతకము ఇంతకు ముందు లేదని, తెలుగు సాహిత్యంలో విశిష్టతను సంతరించుకునే శతకమని కొనియాడారు. స్వగ్రామైన చింతలపల్లిలో విద్యాబుద్ధులు నేర్చుకుని తెలుగు పండిట్‌గా, రచయితగా, పద్య వచన, కథారచయితగా మన్ననలు పొందుతున్న గ్రంథ రచయిత దేవరకొండ శ్రీనివాస వెంకట రమణారావును పలువురు అభినందించారు. కృతిభర్త భమిడిపాటి వెంకట సత్యనారాయణ, సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి, మండల ఉపాధ్యక్షుడు ఇంటిపల్లి ఆనందరాజు, ఎంపీటీసీ మార్లపూడి ప్రసాద్ పాల్గొన్నారు.